

బాసర సరస్వతీ అమ్మవారి నిలయం ఆదివారం భక్తులతో సందడిగా కనిపించింది. - బాసర, ఆంధ్రజ్యోతి

యూరియా కష్టాలకు.. 'నానో'తో చెక్

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



వరిపై డ్రోన్‌తో పిచికారి ఇన్‌సెట్‌లో (నానో యూరియా బాటిల్స్)

బాసర, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రస్తుతం యూరియా కొరత తీవ్రంగా ఇబ్బందులు కలిగిస్తోంది. ఎరువుల కోసం గంటల తరబడి క్యూల్లో నిలబడి చివరికి ఖాళీచేతులతో ఇంటికి చేరుతున్న పరిస్థితి. పంటల నిలువ, దిగుబడులపై ప్రభావం చూపుతుందనే ఆందోళన కమ్ముకుంది. సాంప్రదాయ యూరియా పై రైతులు అలవాటు, అవగాహనలేమి కారణంగా మార్కెట్‌లో ఉన్న నానో యూరియాపై ఇంకా పూర్తిగా నమ్మకం కలగడం లేదు. నిజానికి ఒక్క బాటిల్ నానో యూరియానే ఒక సంచి సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్యాయం. పైగా తక్కువ ధర, సులభమైన రవాణా, సమర్థవంతమైన వినియోగం లాంటి లాభాలు రైతులకు మేలుచేస్తాయని అధికారులు చెబుతున్నారు. అయినా రైతులు ఇంకా సాంప్రదాయ యూరియానే పట్టుకోవడంతో కొరత తీవ్రరూపం దాల్చింది. నానో యూరియాపై అవగాహన పెంచి, రైతుల నమ్మకం పెంచకపోతే ఈ యూరియా కష్టాలకు పుల్‌స్టాప్ పడేటట్లు కనిపించడం లేదు.



రైతులు ఎక్కువగా వాడే సంప్రదాయ యూరియా

● **అరలీటర్... ఎకరానికి..**

పంటకు నత్రజని అందించే యూరియా ఇప్పటి వరకు రైతులకు పరిచయం. ప్రతిపంట సాగులో యూ రియా ప్రధాన భూమిక పోషిస్తుంది. యూరియా లేకుండా వ్యవసాయం అనేది ఊహించలేము. అందుకే రైతుల జీవనంలో భాగంగా నిలిచింది. ప్రత్యామ్నాయం గా కనుక్కున్న నానో యూరియా రైతులకు వరంగా ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. ఎకరానికి 45-50 కేజీల వరకు సాంప్రదాయ యూరియాను వేసినా, అం దులో కేవలం 30-40శాతం మాత్రమే పంటలకు అం దుతోంది. మిగతాభాగం వృథా అవుతూ నేల ఆరోగ్యం దెబ్బతినడం, నీటికాలుష్యం పెరగడం, వాయుకాలుష్యం సృష్టించడం జరుగుతుంది. రైతుజేబుకు కూడా బరువైపోతుంది. ఇక ఈ సమస్యలకు చెక్‌పెడుతూ శాస్త్రవేత్త లు రూపొందించిన నానో యూరియా వ్యవసాయ రం గంలో సంచలనంగా మారింది. కేవలం 500మిల్లీలీటర్ల ఒక బాటిల్‌తో ఎకరానికి సరిపోతుంది. ఆకులపై పిచికారి చేయగానే నానో కణాలు నేరుగా మొక్కలోకి చేరి 80శాతం వరకు నత్రజని శోషింపచేస్తాయని నిపుణు లు పేర్కొంటున్నారు.

● **తక్కువ శ్రమ... ఖర్చు**

సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియాతో రైతుఖర్చులు గణీయంగా తగ్గుతాయి. 50కేజీ బస్తా రూ.170 వరకు ఉంది. కొనుగోలు కేంద్రం నుంచి ఇంటికి నుంచి పొలానికి రవాణా కష్టంతో కూడుకున్న ది. అదే అరలీటర్ నానోయూరియా బాటిల్ ధర రూ. 100-130 వరకు ఉంది. రవాణా, ప్రయోగించడం సుల భం. ఎకరానికి 50 కేజీల ఎరువుకు బదులుగా కేవలం ఒక బాటిల్ సరిపోవడం వల్ల రవాణా, కార్మిక ఖర్చుల తగ్గించుకోవచ్చు. పర్యావరణానికి మేలు సాంప్రదాయ యూరియా వృథా అవడం వలన కలిగే కాలుష్యం తగ్గి పోతుంది. భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూ స్తాయి. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు కూడా గణనీయంగా తగ్గుతాయి. వ్యవసాయరంగంలో నూతన శకంగా నిపుణులు సూచిస్తారు. పంట దిగుబడులు పెంచడమే కాకుండా ఖర్చు తగ్గించి రైతులకు రెండు విధాలుగా లాభం కలుగుతుందని పలువురు అధికారు లు అభిప్రాయపడుతున్నారు. నేలలో వేసే ప్రారంభ సమయంలో సంప్రదాయ యూరియా వాడుకొని మొక్కపెరిగిన తర్వాత మాత్రం నానో యూరియా వాడాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. యూరియా ఒక్కటే కాదు డీఏపీ, పొటాష్‌లు కూడా బస్తాలతో పోలిస్తే ద్రవరూపంలో అతి తక్కువ ధరలో లభిస్తున్నా యి. ఆసక్తి ఉన్న రైతులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే పూర్తి వివరాలను వినియోగ పద్ధతులు తెలియజేసే అవకాశం ఉంటుంది.

రైతులకు అవగాహన కల్పించాలి

● ఆనంద్ బండారి, కిసాన్ సంగ్ రైతుసంఘం నాయకులు, బాసర



నానోయూరియా గురించి తెలియక రైతులు సాంప్రదాయ యూరియాని మర్చిపోలేకపోతున్నా రు. విస్తృతంగా అవగాహన కల్పించాలి. గ్రామానికి కొంత భాగంలో నానో యూరియాతో ఉపయోగించి దాని ఫలితాలతో రైతులకు నమ్మకం కలిగించాలి. క్రమేపి రైతులు నానోవైపు అలవాటు పడే అవకాశం ఉంది.



వరి పంట

నేటి నుంచి విధుల్లోకి గ్రామ పాలన అధికారులు

● జిల్లాల్లో 159 క్లస్టర్లకు అధికారులు

ముథోల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. జిల్లాలో 18 మండలాల పరిధిలో పని చేసేందుకు 159 మంది గ్రామ పాలన అధికారులను నియమించింది. గ్రామస్థాయిలోని వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేసింది. అయితే గతంలో వీఆర్వో, వీఆర్‌ఏలుగా పని చేసిన ఉద్యోగులను తాజాగా జీపీవోలుగా తీసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆసక్తి గల ఉద్యోగులకు అర్హత పరీక్షలు నిర్వహించగా ఉత్తీర్ణులైన వారిని ఒక క్లస్టర్‌కు ఒకరు చొప్పున జిల్లాలో 159 క్లస్టర్లలో 159 జీపీవోలు నియమించారు. అయితే నిర్మల్ జిల్లాలో పరీక్షలు రాయగా ఉత్తీర్ణులైన 100 మందితో పాటు మరో 59 మంది జూనియర్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జిగా జీపీవోలను నియమించారు. జిల్లాకు 159 మంది అధికారులను కేటాయించగా వారు జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా సంబంధిత పత్రాలను పొందారు. వీరు జిల్లాలోని ఆయా మండలాల్లో గల పోస్టింగ్ ఇచ్చారు. జిల్లాలో మొత్తం 159 క్లస్టర్లలో 159 మంది జీపీవోలకు 11వ తేదీన జిల్లా కేంద్రంలో వారికి పోస్టింగ్‌లను అలాట్ చేశారు. వీరు తమకు కేటాయించిన స్థలంలో సోమవారం విధుల్లో చేరుతారు.

రెవెన్యూ శాఖలో కీలకం...

ఇక నుంచి జీపీవోలు గ్రామ రెవెన్యూ శాఖలో కీలకంగా మారనున్నారు. భూభారతి చట్టంలో భాగంగా ప్రతి రిజిస్ట్రేషన్ మ్యూటేషన్‌లో వీరు సహాయకారిగా పనిచేయిస్తారు. పల్లెల్లో సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులు ఎంపికపై విచారణ, ప్రభుత్వ, ప్రైవేట్ భూములు సర్వేనంబర్లు, చెరువులు, కుంటలు తదితర భూములతో పాటు పరిపాలన వ్యవహారాలన్నీ వీరే పర్యవేక్షిస్తారు. ప్రభుత్వ జూనియర్ అసిస్టెంట్ కేడర్లు జీపీవోలు పోస్టులను సృష్టించగా వీరు పదకొండు రకాల విధులను నిర్వహిస్తారు.

క్లస్టర్ల వివరాలు...

జిల్లాలోని ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన క్లస్టర్ వివరాలు ఇలా ఉన్నాయి. సోన్‌లో 7 క్లస్టర్లు, దిలావర్‌పూర్ మండలంలో 7 క్లస్టర్లు, నిర్మల్ అర్బన్ 4 క్లస్టర్లు, లక్ష్మణచాంద 10 క్లస్టర్లు, నిర్మల్ రూరల్ 9 క్లస్టర్లు, నర్సాపూర్ 7 క్లస్టర్లు, దస్తురాబాద్ 4 క్లస్టర్లు, ఖానాపూర్ 15 క్లస్టర్లు, కడెం 12 క్లస్టర్లు, పెంబి 6 క్లస్టర్లు, మామడ 8 క్లస్టర్లు, సారంగాపూర్ 11 క్లస్టర్లు, బాసర 5 క్లస్టర్లు, కుంటాల 5 క్లస్టర్లు, ముథోల్ 8 క్లస్టర్లు, కుబీర్ 10 క్లస్టర్లు, భైంసా 14 క్లస్టర్లు, లోకేశ్వరం 8 క్లస్టర్లు, తానూర్ మండలంలో 9 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. క్లస్టర్‌కు జీపీవోగా నియమితులయ్యారు.

విధులు పకడ్బందీగా నిర్వహిస్తాను...

● టి.నవీన్, జీపీవో, చించోలి (ఎం) క్లస్టర్, సారంగాపూర్



జీపీవో నోటిఫికేషన్ రాగానే పరీక్ష రాసి ఎంపికయ్యాను. ఇదివరకు ము థోల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేశాను. నా విధులను పకడ్బందీగా నిర్వహిస్తాను. గ్రామస్థాయిలో ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంతో పాటు భూ భారతి అమలుకు కృషి చేస్తాను. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి నా విధులను సక్రమంగా నిర్వహిస్తాను.

వాగుదాటి టీకాలు వేసిన ఏఎన్‌ఎం



వరద నీటిని దాటుకుంటూ వెళ్తున్న ఏఎన్‌ఎం

కుభీర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో భాగంగా రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళుతూ మధ్యలో గల వాగులో మోకాలు లోతు నీటిలో వెళ్లి టీకాలు వేశారు ఏఎన్‌ఎం. కుభీర్ మండలంలోని పార్డి(బి) సబ్‌సెంటర్ పరిధిలోని సోమేశ్వర్ తండా నుంచి మౌలానానగర్ వెళ్లాలంటే మధ్యలో గల వాగుపై వంతెన లేకపోవడంతో డ్యూటీలో భాగంగా ఇక్కడి ఏఎన్‌ఎం సురేఖజాదవ్ వరద నీటిని సైతం లేక్కచేయకుండా శనివారం అక్కడికి వెళ్లి చిన్నారులకు టీకాలు వేశారు. గ్రామంలో, తండాలో జ్వరాలబారిన పడిన వారికి మందులను అందజేశారు. గమనించిన సోమేశ్వర్ తండా, మౌలానా నగర్ వాసులు అభినందించారు. ఆమె సేవలను కొనియాడారు.

ప్రయివేట్ ఆసుపత్రుల సిబ్బంది కార్యవర్గం

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల ఆయా విభాగాల సిబ్బంది నూతన సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాథోడ్ వసంత్, ఉపాధ్యక్షులుగా సాయికిరణ్, ప్రధాన కార్యదర్శిగా మురళి, కోశాధికారిగా ప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా గణపతిరెడ్డి, సభ్యులుగా నారాయణ, రాజు, శ్రీధర్, ప్రమోద్, ప్రణయ్, ప్రసాద్, అనిల్, భరత్, మల్లేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఖానాపూర్ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

● రాజురలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్య, వైద్యంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని రాజురలో నిర్మాణం పూర్తయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదిలాబాద్ ఎంపీ నగేష్‌తో కలిసి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రారంభించారు. అనంతరం మండలంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. మండలంలోని దాసునాయక్ తండా, బాధనకుర్తి గ్రామాల్లో నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణపనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తానన్నారు. ఇటీవల వరదల నేపథ్యంలో ఖానాపూర్ నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, కల్వర్టుల మరమ్మతులకు యుద్ధప్రాతిపదికన నిధులు మంజూరు చేశారన్నారు. కడెం మండలంలో వరదల్లో కొట్టుకుపోయిన కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ. 5లక్షలు అందజేశామన్నారు. వేర్వేరు కార్యక్రమాలలో ఏఎంసీ చైర్మన్ భూమన్న, వైస్‌చైర్మన్ అబ్దుల్ మజీద్, ఖానాపూర్ ఆత్మకమిటీ చైర్మన్ తోట సత్యం, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణ రెడ్డి, ఖానాపూర్ మున్సిపల్ మాజీచైర్మన్ చిన్నం సత్యం, ఖానాపూర్ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చిన్నం రవీందర్, గుడాల రాజన్న, తదితరులున్నారు.

నిరుపేదలకు అండగా కేంద్రం

● ఎంపీ గెడం నగేష్

నిరుపేదలకు అండగా నిలిచేలా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేష్ అన్నారు. ఖానాపూర్ మండలంలోని రాజుర గ్రామంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నూతన భవనాన్ని ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌తో కలిసి ఎంపీ ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం చేపడుతు న్న సంక్షేమ పథకాలను వివరించారు. మారుమూల గ్రామాల్లోని నిరుపేద ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నూతన భవనాల నిర్మాణానికి కృషి చేస్తోందన్నారు. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులున్నారు.



ఆసుపత్రిలో ఫార్మసీలో మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

అర్ధరాత్రి ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ శనివారం అర్ధరాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో నిల్వచేసిన మందులను పరిశీలించిన ఎమ్మెల్యే వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో శస్త్రచికిత్స విభాగంలో చికిత్సపొందుతున్న వారిని పరామర్శించారు. కాగా శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులను ఒకే వార్డులో స్త్రీ, పురుషులను ఉంచి చికిత్సలు అందించడం పట్ల ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే స్త్రీ, పురుషులను వేరువేరు వార్డులలో ఉంచాలని సూచించారు.

అంబులెన్స్‌లకు దారేదీ!



ఏరియా ఆసుపత్రి అవరణలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు

భైంసా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రి ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. నిత్యం వందలాది ద్విచక్రవాహనాలు ఆసుపత్రి అవరణలో పార్కింగ్ చేస్తున్నారు. భైంసా నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు నిర్వహించే వారందరూ ఇక్కడ వరకు ద్విచక్ర వాహనాలపై వచ్చి వాటిని ఆసుపత్రి అవరణలో పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. బస్సులలో వెళ్లి తమ కార్యక్రమాలను పూరి చేసుకొని తిరిగి ఇక్కడకు వచ్చి తమ తమ వాహనాలను తీసుకువెళుతున్నారు. ఈ క్రమంలో అంబులెన్స్‌ల రాకపోకలకు స్థలం లేకుండా పోతోంది. అవరణంతా వాహనాలతో నిండకపోయి ఉండడంతో 108, 102 అంబులెన్స్‌లతో పాటు ఇతర ప్రయివేట్ అంబులెన్స్‌లు ఆసుపత్రి అవరణలోకి రావడానికి వీలు లేకుండా పోతోంది. అత్యవసర రోగులకు ఇక్కడి ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకు తరలించడానికి నిత్యం పాట్లు తప్పడం లేదు. ఆసుపత్రి అవరణలో చోటు లేక అధిక పర్యాయాలు 108, 102 అంబులెన్స్‌లు ఆసుపత్రి ఎదుట భాగంలోనే నిలుపుకోవాల్సి వస్తోందంటే పరిస్థితి తెలిసిపోతుంది.

'జాయింట్ స్టాఫ్‌కౌన్సిల్ పునరుద్ధరించడం హర్షణీయం'

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యోగుల జాయింట్ స్టాఫ్‌కౌన్సిల్‌ను పునరుద్ధరించడం హర్షించదగిన విషయమని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో తెలంగాణ రాష్ట్రటీచర్స్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడ్డంభూమన్న, రాష్ట్ర బాధ్యులు సుంకిశాల ప్రభాకర్‌రావు, జగిత్యాల, ఆదిలాబాద్ బాధ్యులు శ్రీనివాస్ గౌడ్, రామగిరి శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కుమార్, అరుణ్, దర్శనం దేవేందరున్నారు.

కుంటాలలో భారీ వర్షం

కుంటాల, సెప్టెంబర్, 14 : (ఆంధ్రజ్యోతి) : కుంటాలలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఒకేసారి గాలి, వాన బీభత్సంతో భారీవర్షం కారణంగా గ్రామాల్లో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వర్షానికి మండలంలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించగా కల్లూరు వాగు ఉధృతంగా ప్రవహించింది.

కొట్టుకుపోయిన ధర్మారం-సోన్ బ్రిడ్జి

● పదిహేను రోజులుగా నిలిచిన రాకపోకలు ● ఇంకా బాగుచేయని ధర్మారం టూ సోన్ రోడ్డు ● ప్రయాణికులకు ఇబ్బందులు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భారీవర్షానికి వచ్చిన వరద కారణంగా రోడ్డుపై గల సిమెంట్ పైప్ బ్రిడ్జి పదిహేను రోజుల క్రితం కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మామడ నుంచి మొదలుపెడితే దాదాపు 20 గ్రామాల ప్రజలు ఈ రోడ్డు నుంచే ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి వంటి పట్టణాలతో పాటు తెలంగాణ రాజధాని నగరం హైదరాబాద్‌కు కూడా ప్రతినిత్యం రాకపోకలు కొనసాగిస్తారు. వంతెన కొట్టుకపోయినట్లు అటువైపు గాని, ఇటువైపు గాని ఎలాంటి హెచ్చరికలు లేని కారణంగా చాలా మంది ప్రయాణికులు కొట్టుకపోయిన బ్రిడ్జి వద్దకు వెళ్లి తిరిగి బొప్పారం, నిర్మల్ మీదుగా తమ ప్రయాణం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని వలన వ్యయప్రయాసలతో పాటు అత్యవసర పరిస్థితిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే ఈ బ్రిడ్జిని పునరుద్ధరించాలని కోరుతున్నారు.



భారీ వరదకు కొట్టుకుపోయిన ధర్మారం - సోన్ గ్రామాల మధ్య గల బ్రిడ్జి

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం...

● నాగుల ప్రభాకర్, ధర్మారం



అత్యవసర పని మీద హైదరాబాద్‌కు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. పిల్లల చదువుల కోసం గాని వైద్యం కోసం గాని నిజామాబాద్, హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రజలు అనేక తంటాలు ఎదుర్కొంటున్నారు. కాబట్టి ఈ వంతెనను వెంటనే పునర్నిర్మించాలి.

శాశ్వత వంతెనను నిర్మించాలి...

● గజ్జెల రమేష్, ధర్మారం



అధిక వర్షాలకు కొట్టుకపోయిన ప్రతిసారి మామూలుగా పైపులు వేసి చేతులు దులుపుకుంటున్నారు. దీని వలన ఆ వంతెన భారీ వర్షం కురిసిన ప్రతిసారి కొట్టుకపోతుంది. కాబట్టి పకడ్బందీగా శాశ్వత వంతెనను నిర్మించాలి.



ఇంటిపైకి ఎక్కిన ఎద్దు

నిరాలలో ఇంటిపైకి ఎక్కిన ఎద్దు

జైనథ్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ పరిధిలో గల నిరాల గ్రామంలో ఆదివారం ఎద్దును కుక్కలు వెంబడించడంతో ఎద్దు ఇంటిపైకి ఎక్కిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్థులు, రైతుల వివరాల ప్రకారం.. నిరాల గ్రామానికి చెందిన షెక్‌గఫూర్ అనే రైతుకు చెందిన ఎద్దు ఇంటి ఆరుబయట కట్టేసి ఉంది. అయితే గ్రామంలో రోజురోజుకు కుక్కల బెడద అధికం కావడంతో పలు సందర్భాలలో స్థానికులు, పశువులు కుక్కకాటుకు గురికావాల్సి వచ్చిందని రైతులు తెలిపారు. కుక్కలను నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం కుక్కల గుంపు ఎద్దును వెంబడించడంతో ఒక్కసారి రాళ్లకట్టపైకి ఎక్కి తీర ఇంటిపైకి ఎక్కింది. దీంతో స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. పలువురు ఆ దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లలో బంధించారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన విఠల్‌మాస్టర్ ఇంటికి కొంత భాగం ధ్వంసమయ్యింది. చివరకు ఆయన రైతుల సహకారంతో ఎద్దును ఇంటి పైనుంచి తాళ్ల సహాయంతో కిందకి దించారు. ఇప్పటికైనా సంబంధిత మండల రెవెన్యూ పంచాయతీరాజ్ అధికారులు తక్షణం స్పందించి గ్రామంలో కుక్కలను పూర్తిగా నియంత్రించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం

జైనథ్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో గల సాంఘిక సంక్షేమ హాస్టల్‌లలో గల విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నామని అసిస్టెంట్ షెడ్యూల్డ్ క్యాస్ట్ డెలవప్‌మెంట్ అధికారి పి.నారాయణ, హెచ్‌డబ్ల్యూవో నారాయణలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందులో జైనథ్ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ డి.వేణుగోపాల్‌తో పాటు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు, పోషకులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏకధాటి వర్షంతో గ్రామీణుల ఇక్కట్లు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీనిలో భాగంగా మధ్యాహ్నం గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మండలంలోని కొల్హారీ, దేగామా, గిర్నూర్, పిప్పిరి, తదితర గ్రామాల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరి నిత్యావసర వస్తువులు తడిసి ముద్దయ్యాయి. అంతేకాకుండా కొల్హారి గ్రామ సమీపంలోని గుట్ట నుంచి కాలువ వరద ఇళ్ల మధ్యలో నుంచి ప్రవహించగా.. ఇళ్లల్లో చెట్ల కొమ్మలు, నీళ్లు చేరాయి.

'ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం'

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరాంతరం టీయూటీఎఫ్ పోరాడుతుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం అన్నారు. విద్యా శాఖ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారితో పాటు ఇటీవల పదోన్నతులు పొందిన సంఘ బాధ్యులను సన్మానించారు. ఆదివారం స్థానిక హిందీ హైస్కూల్లో సంఘ బాధ్యులను సన్మానిచంచారు. ఈ సందర్భంగా టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం మాట్లాడారు.

ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో డీఎస్పీ విచారణ

బోథ్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో యువకులు ప్రవేశించిన సంఘటనలపై ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి విచారణ చేపట్టారు. శుక్రవారం సాయంత్రం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు హాస్టల్‌కు చేరుకొని విచారణ చేపట్టారు. సంఘటన ఏవిధంగా జరిగింది?, యువకులు ఏవిధంగా లోపలికి ప్రవేశించాలనే విషయమై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతే హాస్టల్‌లో ప్రవేశించిన యువకులు ఏవిధంగా లోపలికి చేరుకున్నారు. వారికి ఎవరి సహకారం ఉందనేది పోలీసులు విచారణ చేస్తున్నారు. దాదాపు ఐదు ఫీట్ల ఎత్తులో ఉన్న కాంపౌండ్ వాల్ నుంచి లోపలికి ఎలా రావడం జరిగిందనే విషయంపైన విచారణ చేస్తున్నారు. కారకులు ఎవరైనా విచారణలో తేలిన వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ విషయమై స్థానిక ఎస్సై శ్రీసాయిని వివరణ కోరగా.. విచారణ చేస్తున్నామని వాస్తవాలు తేలిన తర్వాత బాధ్యులపై చర్యలు తప్పవని ఎస్ఐ తెలిపారు. కాగా స్థానిక పోలీస్ అధికారులు ఉన్నారు.



హాస్టల్‌లో విచారణ చేస్తున్న ఆదిలాబాద్ డీఎస్పీ

పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

● బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు

జైనథ్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్, సాత్నాల, జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలలో భారీ వర్షాలు వరదలకు పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వం పంట నష్ట పరిహారాన్ని అందించాలని బీజేపీ కిసాన్‌సెల్ జైనథ్ మండల అధ్యక్షులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన జైనథ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు వరదలతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న పంటలకు ప్రభుత్వం యూరియాను రైతులకు అందించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. పంట నష్ట పరిహారం అందించే వరకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలను గ్రామాలకు రానివ్వమని హెచ్చరించారు. అనంతరం ఆదిలాబాద్ వ్యవసాయ శాఖ జేడీఏ శ్రీధర్‌స్వామికి వినతి పత్రం అందజేశారు. ఇందులో బీజేపీ జైనథ్ మండల నాయకులు సిడాం రాకేష్, పొచ్చన్న, అశోక్, సూర్యరెడ్డి, కూరే అశోక్‌లతో పాటు ఆయా గ్రామాల ముగింపు రైతులు పాల్గొన్నారు.

'నాయకులకు సమస్యల వినతి'

బజార్ హత్నూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌లకు ఆదివారం మోర్థండి, మాడగూడ గ్రామస్థులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సమస్యలను విన్నవించారు. దీనిలో భాగంగా మోర్థండి సమీపంలో లోలెవల్ బ్రిడ్జి వద్ద మరమ్మతులతో పాటు మాడగూడలో సైడ్‌వాల్ నిర్మాణానికి కృషి చేస్తామని, త్వరలో మరమ్మతులు జరుగుతాయన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జల్కే పాండురంగ్, మార్కెట్ కమి టీ డైరెక్టర్ పోరెడ్డి నారాయణ, వెంకటరమణ, తదితరులున్నారు.

ఉత్కంఠగా సహకార సంఘం ఎన్నిక

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం పాలకవర్గం ఎన్నిక ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జిల్లా సహకార అధికారి బి.మోహన్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష పదవి కోసం సాయిచైతన్య, మేకల రవికాంత్ నామినేషన్‌లను దాఖలు చేయగా, ఉపాధ్యక్ష పదవి కోసం కేమ లక్ష్మణ్, కెంద రాకేష్ నామినేషన్ వేశారు. సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలను నిర్వహించారు. దీంతో పోటీ చేసిన సదరు అభ్యర్థులకు చేరి ఆరు ఓట్లు సమానంగా వచ్చాయి. దీంతో లాటరీ విధానంలో ఎన్నిక నిర్వహించగా సాయిచైతన్య, కేంద రాకేష్‌లను అదృష్టం వరించింది. వారిరువురు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైనట్లుగా డీసీవో ప్రకటించారు. హైదరాబాద్ నుంచి నియమాకపత్రం రావాల్సి ఉందని.. అది వచ్చిన వెంటనే వారికి అందజేస్తానని తెలిపారు. దీంతో హర్షం వ్యక్తం చేసిన వారి మద్దతుదారులు, యాదవ కులస్తులు, డైరెక్టర్లు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కాగా సంఘం డైరెక్టర్‌లుగా మేకల రవికాంత్, కేమ లక్ష్మణ్, వై.కిష్టయ్య, జి.వేణుగో పాల్, అసుర రమేష్, పాత దేవన్న, గొర్ల రాజన్న, కేమ ఊషన్న, జి.వెంకటేష్, బి.రవీలతో పాటు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సైబర్ నేరాల అభియోగంపై పీడీ యాక్ట్ : నిజామాబాద్ సీపీ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేస్తున్న వ్యక్తిపై పీడియాక్ట్ కేసు నమోదు చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. రాష్ట్రంలో మొదటిసారిగా సైబర్ నేరాల మీద పీడియాక్ట్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రధాన సూత్రదారుడైన కోలనాటి నాగశివపై పీడీ యాక్ట్ నమోదు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించామని తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కొంతమంది నిరుద్యోగ యువతకు కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి లావోస్, థాయిలాండ్ దేశాలకు పంపించి అక్కడ సైబర్ నేరాలకు పాల్పడేలా బలవంతం చేసిన నాగశివను అరెస్టు చేసి పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసుల సమాచారం ప్రకారం నిందితుడు నాగశివ ఉద్యోగాలు ఇప్పిస్తానని, అధిక వేతనాలు ఇస్తానని చెప్పి లావోస్, థాయిలాండ్ దేశాలకు పంపించేవాడని.. ఆ తర్వాత వారి పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకొని చట్టవిరుద్ధమైన సైబర్ మోసాలను బలవంతంగా చేయించేవాడని తెలిపారు. ఇతనిపై పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులు రాగా, కేసు నమోదు చేసి పీడియాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఎవరైనా యువతను అధిక వేతనాలు ఇప్పిస్తామని మోసపూరితమైన వాగ్దానాలు చేసి యువతను నమ్మించి ఉద్యోగాల పేరిట సైబర్ నేరాలకు పాల్పడేలా చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



బీఎడ్ కాలేజ్ మహిళా ఛాత్రోపాధ్యాయుల వసతి గృహం

నిబంధనలు.. తుంగలోకి..

(5వ పేజీ తరువాయి...)

కొందరు పీజీహెచ్‌ఎంలతో పాటు స్కూల్ అసిస్టెంట్లు ఐటీడీఏ అధికారులు ఏర్పాటు చేసిన బీఎడ్ కళాశాలలో డిప్యూటేషన్‌లపై లెక్చరర్లుగా వ్యవహరిస్తున్నారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాల్సిన టీచర్లు బీఎడ్ కళాశాలలో పని చేస్తుండడంతో.. వారి స్థానాలలో సీఆర్టీలు పని చేస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలో వేతనాలు పొందుతూ బీఎడ్ కళాశాలలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బీఎడ్ కళాశాల ఏర్పాటు చేసి దశాబ్దాలు కావొస్తున్నా.. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రెగ్యులర్ ఉద్యోగులను నియమించడంలో జాప్యం చేస్తూ వస్తున్నారు. ఫలితంగా అంతంతమాత్రంగానే గిరిజన ఛాత్రోపాధ్యాయుల చదువులు సాగుతున్నట్లు గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. బీఎడ్ కళాశాలకు రెగ్యూలర్ ప్రిన్సిపాల్ సైతం లేకపోగా.. పీఈటీసీ ప్రిన్సిపాల్, పీవీటీజీ ఏపీవో బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ మేస్రం మనోహర్ కొన్నేళ్లుగా ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అదేమాదిరి ఫిలాసఫీ, ఫిజికల్ సన్స్, ఇంగ్లీష్, సోషల్, సైకాలజి, స్కూల్ మేనేజ్‌మెంట్, విద్యా దృక్పథాలు, ఫిజికల్ డైరెక్టర్, ఫైన్ ఆర్ట్స్ ఇలాంటివి బోధించడానికి ఆశ్రమ పాఠశాలల టీచర్లు కృషి చేస్తున్నారు.

భవనాలు నిర్మించారు.. సౌకర్యాలు విస్మరించారు

ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో రూ.3.50 కోట్లతో గిరిజన సంక్షేమ అధికారులు కళాశాల భవనం నిర్మించారు. అందమైన భవనం, తరగతి గదులు, ఆసక్తికరమైన వాతావరణం ఉన్నప్పటికీ.. రెగ్యూలర్ సిబ్బంది లేరని ఛాత్రోపాధ్యాయులు అసంతృప్తిగానే శిక్షణ పూర్తి చేస్తున్నారు. అంతేకాకుండా మహిళా ఛాత్రోపాధ్యాయుల కోసం కళాశాల సమీపంలోనే రూ.కోటి నిధులు వెచ్చించి వసతి గృహం నిర్మించినప్పటికీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను నియమించ లేదు. గదులు మాత్రం కేటాయించడంతో.. వారే నివాసం ఉంటూ వంట చేసుకొని గదులను శుభ్రం చేసుకుంటున్నారు. రెగ్యూలర్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌తో పాటు పారిశుధ్య సిబ్బందిని, వంట మనుషులను నియమించాలని ఛాత్రోపాధ్యాయులు కోరుతున్నారు.

వైద్య సిబ్బందిపై దాడి.. కేసు నమోదు

బోథ్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం అర్ధరాత్రి వైద్య సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. శుక్రవారం రాత్రి సమయంలో కనుగుట్ట గ్రామానికి చెందిన నల్ల రాము భార్య పురుగుల మందు తాగడంతో ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తీసుకురావడం జరిగింది. అయితే మందు తాగిన మహిళ వాంతులు చేసుకోవడంతో మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ ఆసుపత్రికి రిఫర్ చేశామని వైద్యులు తెలిపారు. అయితే మందు తాగిన మహిళ భర్త రాము ఆసుపత్రి సిబ్బందిపై దుర్భాషలాలతో దాడికి పాల్పడంతో వైద్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు. ప్రభుత్వ విధుల్లో ఉన్న వారి పైన దాడి చేయడం వల్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

ఖానాపూర్ వాసికి జాతీయపురస్కారం



జాతీయ పురస్కారాన్ని అందుకుంటున్న కదార్ల గంగనర్సయ్య

ఖానాపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ వాసి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కదార్ల గంగ నర్సయ్యకు ఓ అరుదైన ఘనత దక్కింది. హైదరాబాద్‌కు చెందిన శ్రీవిరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళాపరిషత్, తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి గాను అందజేసిన విశ్వకర్మ స్ఫూర్తి లెజెండరీ జాతీయ గౌరవ పురస్కారానికి ఖానాపూర్‌కు చెందిన కదార్ల గంగనర్సయ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై నిర్వాహకుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు. ఆయా సేవా రంగాల్లో అందించిన సేవలకు గాను తనకు ఈ అరుదైన అవకాశం దక్కిందని గంగనర్సయ్య తెలిపారు. జాతీయ పురస్కారం అందుకున్న గంగనర్సయ్యను స్థానికులు అభినందిస్తున్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

కుంటాల, సెప్టెంబర్, 14 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలో ఆదివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్లూరు కస్తుర్బా పాఠశాలలో విద్యార్థినులకు హిందీ ఉపాధ్యాయురాలు ప్రత్యేక తరగతులు నిర్వహించి బోధించారు. హిందీ భాష గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు హిందీ ఉపాధ్యాయురాలిని ఘనంగా సన్మానించారు.

ఘనంగా సేవా పక్వాడ



పెంచికల్‌పాడ్‌లో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

కుంటాల, సెప్టెంబర్, 14 : (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన పుట్టిన రోజు పురస్కరించుకొని ఈ నెల 17వ తేదీ నుంచి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదేశానుసారం కుంటాల మండలం పెంచికల్‌పాడ్ గ్రామంలో బీజేపీ నాయకులు వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దిగంబర్‌పటేల్, మండల ప్రధాన కార్యదర్శి సూర్యవంశీ సాయి, రవీందర్‌పటేల్, ప్రసాద్, దశరథ్, సూర్యకాంత్, లక్ష్మణ్, సంతోష్, వెంకట్, గణేష్, రమేష్, లోకేష్ ఉన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో పూజలు

కుంటాల, సెప్టెంబర్, 14 :(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం పూట అభిషేకం, అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

పెంబి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. ఆదిలాబాద్ మండలంలోని మందపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రూ.12 లక్షలతో మంజూరైన నూతన అంగన్‌వాడీ కేంద్రానికి భూమిపూజ చేశారు. అనంతరం ఇటీవల పిడుగుపాటుతో మృతిచెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల స్వప్నిల్ రెడ్డి, కాం గ్రెస్ నాయకులు మహేందర్, రమేష్, భీమ్‌రావు, తదితరులున్నారు.

కడెం : మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలోని తెలంగాణ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో రూ.13 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను ఆదివారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఏ.దేవన్న యాదవ్, ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూమన్న, ఆత్మకమిటీ చైర్మన్ సత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, బొడ్డు గంగన్న పాల్గొన్నారు. కడెం మండలంలోని సారంగాపూర్ గ్రామంలో రూ.12 లక్షలతో మంజూరైన అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. నాణ్యత కలిగి ఉండేలా చూడాలని, అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, ఆత్మ కమిటీ చైర్మన్ తోటసత్యం, మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్‌యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు టి. శంకర్, గ్రామ అధ్యక్షులు సుధాకర్, కోల శ్రీను, ముస్కు రాజు, లచ్చన్న, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

దక్షిణ భారత స్థాయి గణిత విజ్ఞాన మేళాకు ఎంపిక

భైంసా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుభద్ర వాటిక శ్రీసరస్వతీ శిశు మందిర్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని రమ్యశ్రీ దక్షిణ భారతస్థాయి గణిత విజ్ఞాన మేళాకు ఎంపికైంది. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ విద్యాపీఠంలో రాష్ట్రస్థాయి గణిత విజ్ఞాన మేళా జరిగింది. ఇందులో నిర్మల్ జిల్లా తరఫున పాల్గొన్న రమ్యశ్రీ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచి దక్షిణ భారత స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 18 నుంచి హైదరాబాద్‌లోని శారదదామంలో జరుగునున్న దక్షిణభారత స్థాయి విజ్ఞాన మేళాలో రమ్యశ్రీ పాల్గొననుంది.

మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్

తానూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు రాజు తెలిపారు. అధ్యక్షులుగా రాజు, ఉపాధ్యక్షులుగా నాగభూషణ్, కార్యదర్శిగా అనీల్, గౌరవసలహా సభ్యులుగా దత్త, లాలన్న, ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

16 నుంచి డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

● టీపీడీఎంఏ జిల్లా నాయకులు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 16 నుంచి డిగ్రీ కళాశాల నిరవధిక బంద్ నిర్వహిస్తున్నట్లు టీపీడీఎంఏ జిల్లా నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాలుగు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి విడుదల చేయకపోవడంతో మరోసారి కళాశాలల నిరవధిక బంద్ నిర్ణయించారు. దీంతో జిల్లాలో సుమారు 23 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు మంగళవారం నుంచి మూసివేయనున్నారు. సోమవారం ప్రభుత్వ విధానాల పట్ల, ఫీజులు రాక కళాశాలలు పడుతున్న అవస్థల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి అందరి తోటి నల్లబ్యాడ్జీలు ధరింపజేసి బ్లాక్‌డేగా పాటించాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్య సంఘం సభ్యులు సాయిలు, సిహెచ్ వెంకట్ రెడ్డి, ప్రమోద్ రావు, అఖిలేష్ సింగ్, సతీష్, నర్సారెడ్డి, శ్రీధర్, తదితరులు తెలిపారు.

సీపీఎం ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఈద్‌గాం లేబర్ అడ్డా వద్ద ఆదివారం కార్నర్ మీటింగ్ నిర్వహించినట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి శంభు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికుల గుర్తింపుకార్డుల జారీ ఒక ప్రహసనంగా మారిందని, పేరుకే జారీ చేస్తున్నామని చెబుతున్న వాస్తవానికి కార్మికశాఖ కార్యాలయానికి పరిమితమైపోయిందన్నారు.

టీఆర్‌టీఎఫ్ నూతన కార్యవర్గం

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని టీఎన్జీవో భవనంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా దర్శనం దేవేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ హాజరై ప్రసంగించారు. ఎన్నికల పరిశీలకులుగా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఖాజామంజూర్, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్‌లు వ్యవహరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా గడ్డం భూమన్న, గౌరవ అధ్యక్షుడిగా ప్రశాంత్‌కుమార్, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా తాళ్ల చిన్నయ్య, ఉపాధ్యక్షుడిగా నవీన్‌కుమార్, కూనరవీందర్, కార్యదర్శులుగా మస్కూరి భీమేష్, నర్సయ్య, మహిళా కార్యదర్శిగా ప్రియలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కొట్ల(బి)మాక్స్ కార్యవర్గం ఏర్పాటు



కొట్ల(బి) మాక్స్‌కార్యవర్గ సభ్యులు

సారంగాపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల కొట్ల(బి) మాక్స్ కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటుచేశారు. ఈ మాక్స్ అధ్యక్షులుగా ఎలిపేద్ది భూమారెడ్డి, ఉపాధ్యక్షులుగా సాదు రామ్‌రెడ్డి, కార్యదర్శిగా సోమిరెడ్డి నారాయణ రెడ్డి, కోశాధికారి ఇప్ప వెంకట్‌రెడ్డి, డైరెక్టర్‌లుగా గాజు లక్ష్మారెడ్డి, వంగ గోవింద్‌రెడ్డి, లక్కడి మోహన్‌రెడ్డి, అట్లా సత్యపాల్‌రెడ్డి, గన్ను సాయేందర్‌రెడ్డిలు ఎన్నికయినట్లు మాక్స్ రైతులు తెలిపారు.

ఘనంగా సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు

ఖానాపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్లపాడ్ గ్రామంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సీపీఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సాయుధ పోరాట అమరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోరాట అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నాగెల్లి నర్సయ్య, బోసు భూమన్న, కలమడుగు రాజన్న, లక్ష్మీ, నర్సయ్య, తదితరులున్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి

నర్సాపూర్(జి), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణానికి చెందిన రోహిత్(21) అనే యువకుడు నిర్మల్‌వైపు వెళ్తుండగా రాంపూర్ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రోహిత్ తన స్నేహితుడితో కలిసి యమహ ఎఫ్‌జెడ్ బైక్‌పై ప్రయాణిస్తున్నాడు. వాహనం అదుపు తప్పి రోడ్డుకు కుడివైపునకు దూసుకెళ్లి బోర్డును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రోహిత్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే స్పందించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది రోహిత్‌కు సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసిటేషన్) చేసి, ఆక్సిజన్ అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆసుపత్రికి తరలిస్తుండగానే రోహిత్ మృతిచెందాడు. మృతదేహాన్ని నిర్మల్ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదంలో బైక్‌వెనుక కూర్చున్న రోహిత్ స్నేహితుడికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దస్తురాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గొడిసిర్యాల్ గ్రామానికి చెందిన కొంపల్లి నర్సయ్య(45) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. దీంతో మద్యానికి బానిసైన నర్సయ్య శనివారం తన ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డు

ముథోల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆనందిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉత్తమ ఉపాధ్యా య అవార్డు 2025 కార్యక్రమంలో ఎడ్‌బిడ్ ఫ్యూచర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ బి. ప్రవీణ్ కుమార్ అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఫ్యూచర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ప్రవీణ్‌ని ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో అవార్డు రావడం సంతోషదాయకమని ప్రశంసించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముథోల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన లక్ష్మీబాయి అనే మహిళకు చెందిన ఇల్లు ఇటీవల షార్ట్‌సర్క్యూట్ జరిగి కాలిపోయింది. విషయం తెలుసుకున్న మోహన్‌రావు ప్రజా ట్రస్ట్‌చైర్మన్ భోస్లేమోహన్ రావు పాటిల్ ఆదివారం బాధితకుటుంబాన్ని పరామర్శించి ట్రస్ట్ ఆధ్వర్యంలో తక్షణ సహాయంగా ఆర్థికసహాయం అందజేశారు. నగదు రూ.10 వేల నిత్యావసర సరుకులను అందజేశారు. అనుకోని సంఘటనలకు ట్రస్ట్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మోహన్‌రావు ప్రజాట్రస్ట్‌చైర్మన్ భోస్లే మోహన్ రావు పాటిల్, మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, మాజీ సర్పంచ్ తులసి బాయి ఉన్నారు.

పల్సికర్ రంగారావు ప్రాజెక్టులో పడి ఒకరి మృతి

భైంసా రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన పవార్ రాజు(36) పల్సికర్ రంగారావు ప్రాజెక్టులో పడి ఒకరు మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహాగ్రాం గ్రామానికి చెందిన పవార్ రాజు నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయలుదేరి రంగారావు పల్సికర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకొని మృతిచెందాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం మధ్యాహ్నం కోతుల్‌గాం గ్రామశివారులో చెక్‌డ్యామ్‌లో మృతదేహం కనిపించింది. స్థానికులు, పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శంకర్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన కొల్హారి గ్రామస్థులు



మాట్లాడుతున్న ఆడే గజేందర్

నేరడిగొండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుడిహత్నూర్ మండలం సీనియర్ నాయకులు బాలాజీ పటేల్, మాజీ ఎంపీటీసీ అంకిత్ రవి ఆధ్వర్యంలో ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో గుడిహత్నూర్ మండలంలోని కొల్హారి గ్రామస్తులు చేరారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్ రావు, సీనియర్ నాయకులు బాలాజీ పటేల్, మాజీ ఎంపీటీసీ అంకాతి రవి, నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, చేరిన వారిలో కే రాజు, అమూల్, పరమేశ్, ఎస్ నాగు, అర్జున్, ఆడే విష్ణు, చంబులాల్, బి సునీల్, జాదవ్ రవి, మారుతి, ముండే తుకారాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలి

● ఎస్సీ వసతి గృహం అధికారి సురేందర్



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

తాంసి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని ఎస్సీ బాలుర వసతిగృహం అధికారి సురేందర్ అన్నారు. ఆదివారం తాంసి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చదువుపట్ల వారి వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముఖ్యంగా సెలవు దినాల్లో ఇంటికి వచ్చిన పిల్లల మనోభావాన్ని తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ప్రతీ విద్యార్థి వారి వారి తల్లిదండ్రులు కన్న కలలు నెరవేర్చేలా ముందుకు సాగాలన్నారు. సెలవుల్లో ఇంటికి వెళ్లినప్పుడు కూడా చదువు పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై విద్యార్థిల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, ఉషేందర్, రమేష్, విమల తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం అందించిన ఆత్మీయుడు



మృత కుటుంబాన్ని పరామర్శించిన బి.గజానంద్ నాయక్

నార్నూర్ రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పేదవారి కష్టాలు చెప్పలేము కానీ వారి ఎదురు చూపు అప్పన్న హస్తం కోసం ఉంటుంది. నాకు ఎవరు అయిన ఉన్నారా అనేది వారి బాధ. కానీ నేను ఉన్న అనే ధైర్యం ఇచ్చే ఒక్కరు ఉన్నారు అదే సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి గజానంద్ నాయక్. మండలం కేంద్రంలోని ఆటో వాహన చోదకులు రాజ్బంగే పాండు రంగ్ కొడుకు కొన్ని నెల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. అట్టి కుటుంబానికి తనవంతుగా అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల నగదు అందజేశారు. వారి వెంట ప్యాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడె, డైరెక్టర్ కాంతారావు దుర్గే, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షేక్ దాదే అల్లి, దళిత రత్న అవార్డు గ్రహీతలు నర్సింగ్ మోరే, కొరిలా మహేందర్, బీజేపీ మండలాధ్యక్షులు బిక్కు రాథోడ్, ఫిరోజ్, వడ్డెర సంఘం జిల్లా నాయకులు గుంజ చిన్న, రాజు, సునీల్ బర్కుంబే ఉన్నారు.

ప్రధాన రహదారి.. అస్తవ్యస్తంగా మారి

● రెండు గంటల పాటు స్తంభించిన వాహనాలు



కొల్హారీ వద్ద రోడ్డుపై దిగబడిన వాహనాన్ని నెట్టుతున్న దృశ్యం

బజార్ హత్నూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బజార్ హత్నూర్ మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి కొల్హారి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన వంతెనకు ఇరువైపులా వేసిన మట్టి రోడ్డు బురదతో అస్తవ్యస్తంగా మారి వాహనాలు కూరుకపోయాయి. దీంతో రాకపోకలు స్తంభించాయి. కాగా మధ్యాహ్నం రెండు గంటలుగా భారీ వర్షం కురవడంతో ఇరు వైపులా మట్టి రోడ్డు పూర్తిగా బురదగా మారి వాహనాలు ముం దుకు సాగక దిగుబడి పోయాయి. దీంతో ఇరువైపులా కిలో మీ టర్ వరకు రహదారిపైనే వాహనాలు స్తంభించి పోయాయి. వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రయాణికులు వర్షంలో ఎటూ వెళ్లలేక ఉండిపోవాల్సి వచ్చింది. ట్రాక్టర్ సహాయంతో బూడిదలో నుంచి వాహనాలను లాగి బ యటకు తీశారు. సోనాల - ఇచ్చోడ మండలాలను కలుపుతూ ఈ ఆర్అండ్‌బీ రోడ్డు ప్రధాన రహదారిపై ప్రతీ రోజు పదుల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. గతంలో ఇక్కడి వాగుపై లోలెవెల్ వంతెనతో ఇన్నాళ్లు ఇబ్బంది పడ్డామని, వంతెన పూర్తయినా ఇబ్బందులు తీరడం లేదంటూ వాహన దారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్ల నుంచి వంతెన పనులు ఆగుతూ సాగగా ప్రస్తుతం అధికారులు అప్రోచ్ రోడ్డు పూర్తి చేయకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సర్కారు బడులకు మహర్దశ

- మెరుగుపడనున్న పారిశుధ్య వ్యవస్థ
- నిర్వహణ కోసం జిల్లాకు రూ.3.89 కోట్ల నిధుల మంజూరు
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధుల విభజన



భైంసాలోని ఏపీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

భైంసా, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా పాఠశాలల నిర్వాహణ వ్యవస్థను మెరుగుపరచే దిశగా చర్యలు చేపడుతోంది. ఇందుకు గాను క్రమ పద్ధతిలో నిధులను మంజూరు చేస్తోంది. ఇటీవలనే పాఠశాలలకు సంబంధించి బోధనోపకరణాలైన చాక్‌పీసులు, పాఠశాలలో ఇతర నిర్వహణ ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇందుకు గాను జిల్లాలోని 628 పాఠశాలలకు మొత్తం రూ.1.56 కోట్ల నిధులు కేటాయించాల్సి ఉండగా మొదటి విడత కింద 50 శాతం నిధులు రూ.78.15 లక్షలు విడుదల చేసింది. ఇందులో భాగంగానే తాజాగా బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణ వ్యవస్థ మెరుగుదలకు ప్రత్యేకంగా నిులను మంజూరు చేసింది. 2025-26 వార్షిక విద్యా సంవత్సరం కోసం గాను జిల్లాలోని 628 పాఠశాలలకు రూ.3.89 కోట్లు మంజూరు చేశారు. పాఠశాలల్లో శుభ్రత,పరిశుభ్రత నిర్వహణను మెరుగుపరచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ)ని ఏర్పాటు చేసిన తెలిసిందే. సంబంధిత కమిటీలకు పాఠశాలల నిర్వహణ వ్యవస్థల బాధ్యతను అప్పగించారు.

● **విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని**

పాఠశాల ఆవరణను శుభ్రం చేయడం, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ, మొక్కలకు నీటి తడులు అందించడం వంటి వాటికి నిధుల కొరత సమస్యగా మారింది. ఆయా పనులను గ్రామీణా ప్రాంతాల్లో పంచాయతీరాజ్, పట్టణాల్లో మున్సిపాల్టీలను విభాగాల పర్యవేక్షించేవి. అయితే పారిశుధ్యం మెరుగుపడకపోవడంతో ప్రభుత్వం... పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆ బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఆదర్శ పాఠశాలలకు నిర్వహణ నిధులను కేటాయించింది. సమగ్ర శిక్ష కింద అందించే కాంపోజిట్ స్కూల్ గ్రాంటుకు ఇవి అదనం.

● **విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధుల విభజన**

ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వాహణ వ్యవస్థ మెరుగుదల కోసం జిల్లాకు కేటాయించిన రూ.3.89 కోట్లను ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విభజించారు. ఇందు కోసం గాను పాఠశాలలను స్లాబ్‌లుగా విభజించారు. 1 నుంచి 30 మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.3వేలు, 31 నుంచి 100 మంది వరకు విద్యార్థులున్న పాఠశాలలకు రూ.6 వేలు, ఇదే క్రమంలో 101 నుంచి 250 మంది విద్యార్థులుంటే రూ.8 వేలు, 251 నుంచి 500 మంది వరకు విద్యార్థులుంటే రూ.12 వేలు, 501నుంచి 750మంది విద్యార్థులుంటే రూ.15 వేలు, 750కు పైగా మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ.20వేల చొప్పున కేటాయించిన నిధులను విభజించనున్నారు.

● **మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులివే...**

ప్రస్తుతం మంజూరు చేసిన నిధులతో పాఠశాల ఆవరణలో నిత్యం ఊడ్చి చెత్తను తరలించి శుభ్రంగా ఉంచాలి.మూత్రశాలలు, మరుగుదొడ్లను తరుచూ శుభ్రం చేయడంతో పాటు మొక్కలకు నీరు పట్టించాలి. ఇందుకు తాత్కలికంగా ఓ వ్యక్తిని నియమించుకోవచ్చు అవసరమైన వస్తువుల కొనుగోలు మాత్రం కాంపోజిట్ స్కూల్ గ్రాంటు నుంచే వినియోగించాలని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎంపీ



కుచులాపూర్‌లో మృతి చెందిన లక్ష్మారెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎంపీ

బోథ్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని కుచ్లాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన సల్ల లాస్మారెడ్డి కుటుంబీకులను ఆదిలాబాద్ ఎంపీ జీ. నగేష్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి తనకు అండగా నిలిచిన వ్యక్తిని ఆయన మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్లు రాజేశ్వర్ రెడ్డి, చంద్రమోహన్, మాజీ జెడ్పిటీసి తాటిపల్లి రాజులు ఉన్నారు.

కూనింటి ముత్యంరెడ్డికి నివాళులు

● సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్‌రెడ్డి



ముత్యం రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

మావల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోనిలోని కైలాస్ నగర్‌లో గల బ్రహ్మకుమారీస్ సెంటర్‌లో జరిగిన స్వర్గీయ కూనింటి ముత్యం రెడ్డి సంవత్సరీకం కార్యక్రమంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముత్యం రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. . అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఇందులో ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మండల నూతన కమిటీ ఎన్నిక



ఇచ్చోడలో జిల్లా అధ్యక్షుడి సమక్షంలో నియమితులైన నూతన కార్యవర్గం

ఇచ్చోడ, సెప్టెంబరు, 14 (ఆంధ్రజ్యోతి): మండల నూతన కార్యవర్యాన్ని ఆదివారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ అధ్యక్షతన ఎన్నుకున్నటున్నట్లు నూతన మండల అధ్యక్షుడు తహరె రమేష్ తెలిపారు. మహిళా మోర్చా కె.సుజాత, సోషల్ మీడియ సత్యప్రకాష్, యువ మోర్చా భరత్, గిరిజన మోర్చా కేశవ్, మైనారిటీ మోర్చా ఖదీర్‌లతో పాటు, మండల ఉపాధ్యక్షుడిగా దామోదర్, కార్యవర్గ సభ్యులుగా సుభాష్, భూవేష్, రామారావ్, వినాయకరావ్, రవి, నారాయణరెడ్డి, నానాజీ, బాబ్జీ, సం తోష్, అజయ్‌లను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టండి

● ఏఎస్‌డబ్ల్యూ నర్సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి నర్సింగ్

నార్నూర్ రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో మంచి భవిష్యత్ నిర్మాణం చేయాలంటే విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టండి ఏఎస్ డబ్ల్యూ నర్సింగ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వపరంగా విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు అందించేలా కృషి చేస్తుందన్నారు. ఎలాంటి ఇబ్బంది ఉన్న వసతి గృహం అధికారికి చెప్పండి. విద్యార్థులు మాట్లాడుతూ మాకు ఉండడానికి సరైన బిల్డింగ్ లేదు వర్షాకాలం బాగా ఉరుస్తుంది. మొన్న ఒక్క రూం భారీ వర్షాలకు కూలీ పోయిందన్నారు. దీంతో తాము బిక్కు బిక్కుమని బయపడుతున్నామని చెప్పడం వలన అధికారి స్పందించి రిపేర్‌కు రూ.10 లక్షలు మంజూరు అయినట్లు చెప్పారు. దసరా తర్వాత త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యాలు గురి కాకుండా బాగు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డెన్ రవి, దళిత రత్న అవార్డు గ్రహీత అన్న బహు సాటే మండల అధ్యక్షులు కోరెల మహేందర్, భీం రావు, బాలాజీ, రవి దేవి దాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్మరణ సభ



సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

భీంపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలంలోని ధన్నోర గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు కామ్రేడ్ పెద్ది సత్యనారాయణ ఇటీవలే మృతి చెందారు. ఆయన సంస్మరణ సభ ధన్నోరలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సత్యనారాయణ సేవలు ఎనలేనివన్నారు. కామ్రేడ్ శివన్నతో కలిసి గుంజల భూ పోరాటం చేసి వందలాది కొలం రైతులకు న్యాయం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ తాంసీ, తలమడుగు, భీంపూర్ మండలాల్ కార్యదర్శిలు అద్దంకి రమేష్, ఖండాల గణేష్, మేకల రవి, నాయకులు బక్కి సురేందర్, చిలుక దేవిదాస్, బూరేసాత్విజి, వందన పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో తల్లిదండ్రుల సమావేశం

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువు, ప్రతిభ, ఆరోగ్య సమస్యల గురించి తల్లిదండ్రులతో చర్చించారు. ప్రతిభ, కష్టపడి చదువుతున్న విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. ఎస్సీ హాస్టల్‌లో ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తల్లిదండ్రులకు సూచించారు.

వీడని నిర్లక్ష్యం..


● మళ్లీ తెగిపడ్డ విద్యుత్ వైర్లు
● రెండు సంఘటనల్లో తప్పిన ప్రమాదం



బజార్‌హత్నూర్‌లో తెగిన వైర్లను చూపిస్తున్న స్థానికులు

బజార్ హత్నూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అర్ధరాత్రి వేళ మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి రహదారిపై విద్యుత్ వైర్లు తెగపడిన సంఘటన మరవక ముందే పాత బస్టాండ్ వద్ద ఆదివారం మళ్లీ రెండు చోట్ల వైర్లు తెగిపడగా తృటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే బజార్ హత్నూర్ మండల కేంద్రంలో శనివారం రాత్రి, ఆదివారం మధ్యాహ్నం హఠాత్తుగా విద్యుత్ వైర్లు తెగిపడటంతో అందరు భయభ్రాంతులకు గురయ్యారు. పాత బస్టాండ్ ఏరియాలోని గ్రామపంచాయతీ సమీపంలో ఒక్కసారిగా విద్యుత్ వైరు తెగిపడింది. దీంతో స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వగా వెంటనే విద్యుత్ సిబ్బంది సకాలంలో చేరుకుని విద్యుత్ అందించారు. మరుసటి రోజు ఆదివారం మధ్యాహ్నం అదే ఏరియాలోని కేజీబీవీ పాఠశాల ఆవరణలోని విద్యుత్ స్తంభానికి నీలగిరి చెట్టు ఆనుకొని ఉండటం చేత మంటలై వైరు తెగిపడింది. మండల కేంద్రంలో వరుసగా మాటిమాటికి వైర్లు తెగిపోతుండటం, తృటిలో ప్రమాదాలు తప్పడంతో స్థానికులు హైరానా పడుతున్నారు. ఈ విషయం పట్ల సంబంధిత అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరగకముందే సకాలంలో పాత స్తంభాలు, వైర్లను మార్చి పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఫొటో న్యూస్





బురదమయంగా మారిన సైన్స్ పార్క్

విజ్ఞాన ప్రదేశం.. బురదమయం

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంచేందుకు ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్ ప్రస్తుతం బురదమయంగా మారింది. ల్యాబ్ నిర్వహణను పట్టించుకోకపోవడంతో పరికరాలన్నీ తుప్పు పట్టిపోయి పనికిరాకుండా మారాయి. పార్క్ ఆవరణ మొత్తం వర్షాలతో బురదగా మారి అడుగు కూడా వేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పార్కును పనికొచ్చేలా చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)

ప్రమాదపుటంచున కార్యాలయ భవనాలు



భీంపూర్ తహసీల్దార్ కార్యాలయ పరిస్థితి

భీంపూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, భవనాలు సహా కరణ్ వాడి, టెక్డి గూడ ఐటీడీఏ పాఠశాల భవనాలుపై పెచ్చులు ఊడి పోయి ప్రమాదపుటంచున ఉన్నాయి. ఈ శిథిలావస్థలో ఉన్నా మరమత్తులు చేయించాక వర్షాలకు మరింత ఘోరంగా తయారు అయ్యాయి. ఇటీవలే కలెక్టరేట్ భవనం కూలిపోయిన నేపథ్యంలో మండల కార్యాలయాలు, కరణ్ వాడి, టెక్డి గూడ పాఠశాల భవనాల విషయంలో కూడా స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, భయం భయంగానే రోజులు వెళ్లదీస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మనోళ్లకే ట్రోఫీ



జనగామ జిల్లా కూనూరులో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లాలకు చెందిన బాలురు, బాలికలు 10 జట్ల చొప్పున మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో మొదటి స్థానం ఉమ్మడి అదిలాబాద్ జట్టు సాధించగా, బాలికల విభాగంలో అదిలాబాద్ నాలుగవ స్థానంలో నిలిచింది. - జఫర్‌గడ్, ఆంధ్రజ్యోతి

ఆదివాసీ జేఏసీ ఏర్పాటు : సోయం



బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాపురావు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో తొమ్మిది తెగల ఆదివాసీ రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలో భద్రాచలం బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. సెప్టెంబరు 28న చలో భద్రాచలం కార్యక్రమన్ని తలపెట్టామని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ జేఏసీని ఏర్పాటు చేస్తున్నామని సోయం బాపురావు తెలిపారు. డిసెంబరు 9వ తేదీన హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని, అదేవిధంగా ఢిల్లీలో సైతం బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు.

పనుల్లో జాప్యానికి ప్రభుత్వ అసమర్థతే కారణం : బీఆర్ఎస్



బట్టిసావర్గం శివారులో నిర్మాణంలోని కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రామన్న, నాయకులు

మావల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నూతన కలెక్టరేట్ నిర్మాణ పనుల జాప్యానికి ప్రభుత్వ అసమర్థతే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బట్టిసావర్గం శివారులో నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను బీఆర్ఎస్ నేతలతో కలిసి రామన్న పరిశీలించారు. కలెక్టరేట్ కార్యాలయాన్నీ వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కలెక్టరేట్ నిర్మాణానికి రూ.55 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. పాత కలెక్టర్ భవనం కూలితే బీఆర్ఎస్ నేతలు బాధ్యతయుతంగానే హెల్మెట్లు ధరించి నిరసన తెలిపారని, వారిపై అక్రమంగా కేసులు బనాయించడం ఎంతమేరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ సైతం ఆ ప్రాంతాన్ని పరిశీలించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను ముందుకు సాగించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఎలాంటి ప్రమాదం రాకముందే కలెక్టరేట్ కార్యాలయాల విషయంలో సముచితంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని జోగు రామన్న డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు ఆలాల్ అజయ్, మెట్టు ప్రహ్లాద్, యూనిస్ అక్బని, సాజిదోద్దీన్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ప్రతిపాదికన పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన యూనియన్ జిల్లా 3వ మహాసభలో మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖలో దాదాపు 20, 30ఏళ్ల నుంచి పని చేస్తున్నా.. వేతన సవరణ లేదన్నారు. జూలై 2028 నాటికి పీఆర్సీ గడువు ముగిసిందన్నారు. దాన్ని అమలు చేయని చేయని కారణంగా పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగులు కూడా నష్టపోతున్నారన్నారు. వైద్య ఆరోగ్యంలో శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

దశల వారీగా అభివృద్ధి పనులు

- సాకేరను సందర్శించిన ఎంపీ నగేష్

బోథ్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సాకేర గ్రామస్థుల ఆహ్వానం మేరకు గ్రామానికి రావడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీని గ్రామస్థులు స్వాగతించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీకి గ్రామస్థులు పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. స్పందించిన ఎంపీ తాను గ్రామానికి అండగా ఉంటారని అయితే అభివృద్ధి కోసం నిధులు భవిష్యత్తులో ఇవ్వడం జరుగుతుందన్నారు. తనపైన ఉన్న అభిమానంతో ఆహ్వానించిన గ్రామస్థులకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తాటిపల్లి రాజు, బీజేపీ సీనియర్ నాయకులు రైల్వే బోర్డు మాజీ సభ్యులు జీవీ రమణ, మండల పార్టీ కన్వీనర్ బోరే రవీందర్, కనపర్తి చంద్రకాంత్, మిట్ కరే రాజేశ్వర్, జుగాది రావు, మహిపాల్, శంకర్, నారాయణ, వెంకటేష్, కసల్ చంద్, వెంకటేష్, రాజేశ్వర్ రెడ్డి, సుభాష్, సూర్య, శేఖర్, పోతన్న, తదితరులు ఉన్నారు.



నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్స్ ఎడ్యుకేషన్.. (ఎన్‌సీటీఈ) నిబంధనలను తుంగలో తొక్కుతున్న గిరిజన సంక్షేమ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. బీఎడ్ కళాశాల గుర్తింపునకు ప్రమాదం పొంచి ఉన్నట్లు తెలుస్తుంది. 2008లో ఉట్నూర్ కేంద్రంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఎడ్ కళాశాలకు ఎన్‌సీఈటీ నిబంధనల ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులను, ఉపన్యాసకులను నియమించడంలో గిరిజన సంక్షేమ శాఖ పూర్తిగా విఫలమైనట్లు ఎన్‌సీఈటీ అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు గత రెండు నెలల క్రితం బీఎడ్ కళాశాలకు గుర్తింపు ఇవ్వడంలో అధ్యాపకులను నియమించకపోతే.. గుర్తింపు ఇవ్వడం కుదరని తేల్చినట్లు తెలుస్తుంది.

- దశాబ్దం దాటినా.. దశ మారని వైనం
- రెగ్యూలర్ ఉద్యోగులు, ఉపన్యాసకుల నియామకంలో తీవ్ర జాప్యం
- విఫలమైన గిరిజన సంక్షేమ శాఖ అధికారులు
- ఆశ్రమ పాఠశాలల టీచర్లే లెక్చరర్లు
- భవనాలు నిర్మించి.. సౌకర్యాలు విస్మరించారు
- 2008లో ఉట్నూర్‌లో కళాశాల ఏర్పాటు

ఉట్నూర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి నియమ నిబంధనలు ప్రకారం బీఎడ్ కళాశాలకు 15 మంది టీచింగ్ స్టాఫ్, ఏడుగురు నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాల్సి ఉంది. ఉట్నూర్ బీఎడ్ కళాశాల కంటే ముందే గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భద్రాచలంలో 1999లో బీడ్ కళాశాలను భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఆ సమయంలో కూడా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు 10 పోస్టులను మంజూరు చేశారు. కానీ ఇప్పటి వరకు నియామకాలు చేపట్ట లేదు. అదేవిధంగా 2008లో ఏర్పాటు చేసిన ఉట్నూర్‌లోని బీఎడ్ కళాశాలకు సైతం ఇంత వరకు పోస్టులు మంజూరు కాలేదు. గిరిజన సంక్షేమ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి వస్తుందని తెలుస్తుంది. ప్రతియేటా ఉట్నూర్ బీఈడీ కళాశాలలో డిగ్రీ వరకు చదువుకున్న గిరిజన నిరుద్యోగులకు బీఈడీ చదువుకునే అవకాశం కళాశాల ఏర్పాటు ద్వారా కలిగింది. రాష్ట్రంలోని గిరిజన నిరుద్యోగులకు బీఎడ్ చదువుకునే విధంగా ఫిజికల్ సైన్స్‌లో 10, గణితంలో 25, బయోసైన్స్‌లో 20, సోషల్‌లో 35, ఇంగ్లీష్‌లో 10 వంతున ప్రతీ బ్యాచ్‌కు వంద మందికి శిక్షణ అవకాశాలు కల్పిస్తున్నా రు. ఏజెన్సీ ప్రాంతంలోని పేద విద్యార్థులు ఆర్థిక స్థోమత లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత విద్యా చదువుకోలేకపోతున్నారని భావించిన ప్రభుత్వం.. గిరిజన నిరుద్యోగుల కోసం ఉట్నూర్‌లో బీఎడ్ కళాశాలలో ఏర్పాటు చేసింది.

విఫలమైన గిరిజన సంక్షేమ అధికారులు

గిరిజన నిరుద్యోగులకు ఉపాధ్యాయ ఉద్యోగ శిక్షణ కల్పించాలన్న ఉన్నత ఆశయంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో బీఎడ్ కళాశాలను ఏర్పాటు చేసి దశాబ్దాలు కావొస్తున్నా.. రెగ్యూలర్ ఉద్యోగులను గిరిజన సంక్షేమ అధికారులు నియమించడంలో విఫలమయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు రాష్ట్రంలోని గిరిజన నిరుద్యోగులకు బీఈడీ చదువుకునే విధంగా 2008లో బీఎడ్ కళాశాలను ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 2008 నుంచి 2014 వరకు ఏడాది కోర్సు ఉన్న బీఎడ్ శిక్షణలో ప్రభుత్వం 2014 నుంచి రెండేళ్ల కోర్సు గా ప్రకటించింది. కళాశాల ఏర్పాటుకు 2008లోనే రెగ్యూలర్ పోస్టులు మంజూరు చేస్తామని.. బీఎడ్ కళాశాల ఏర్పాటుకు గిరిజన సంక్షేమ అధికారులు పూనుకున్నారు. కానీ ఇప్పటి వరకు కూడా రెగ్యూలర్ ఉపన్యాసకులను, ఉద్యోగులను నియమించ లేదు. ఈ కళాశాల నుంచి ఇప్పటి వరకు 1600మంది గిరిజన ఛాత్రోపాధ్యాయులు శిక్షణ పూర్తి చేసుకుని కొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా, మరికొందరు సీఆర్టీలుగా ఉద్యోగాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 17వ బ్యాచ్ శిక్షణ కొనసాగుతోంది.

ఆశ్రమ పాఠశాలల టీచర్లే లెక్చరర్లు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న

(తరువాయి 6వ పేజీలో....)

రెగ్యూలర్ ఉద్యోగులను నియమించాలి

: మేస్రం దుర్గు, జిల్లా మేడి, ఉమ్మడి ఆదిలాబాద్



ఉట్నూర్‌లోని బీఎడ్ కళాశాలకు రెగ్యూలర్ పోస్టులు మంజూరు చేయాలి. అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లే శని ఉన్న చందంగా ప్రభుత్వం అన్ని వసతులు కల్పించి రెగ్యూలర్ టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్‌ని నియమించలేదు. ఇప్పటికైనా రెగ్యూలర్ స్టాఫ్ నియామకాలను పూర్తి చేయాలి.

సీఎం దృష్టికి తీసుకువెళ్లాం

: వెడ్మ బొజ్జుపటేల్, ఎమ్మెల్యే ఖానాపూర్



ఉట్నూర్, భద్రాచలం బీఎడ్ కళాశాలకు రెగ్యూలర్ సిబ్బందిని నియమించాలని ముఖ్యమంత్రి దృష్టికి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో తీసుకువెళ్లాం. ముఖ్యమంత్రి హామీతో సమస్యకు పరిష్కారం లభిస్తుంది.



అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

108లో మహిళ ప్రసవం

నార్నూర్ రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంత వాసులకు ఆరోగ్యం పరమైన ఇబ్బంది వస్తే మేము ఉన్నామంటూ 108 పైలెట్ రాజ్‌కుమార్ భరోసాను ఇచ్చారు. దీనిలో భాగంగా ఆదివారం మండలంలోని సుంగాపూర్ కొలంగుడా గ్రామానికి చెందిన దుర్వా రుక్మిణిబాయికి పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. వెంటనే స్పందించిన వారు మెరుగైన చికిత్స కోసం నార్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వస్తుండగా.. అంబులెన్స్‌లో ప్రసవించి మగా బిడ్డను జన్మించిందని వారు తెలిపారు. వారి వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్స్ అసోసియేషన్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సీవోసీ అధ్యక్షుడు దినేష్ మాటోలియా అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిస్ట్రిబ్యూషన్ ప్రతినిధులు పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో అనేక వస్తువులు జీఎస్టీ చెల్లించని వస్తువులే ట్రాన్స్‌పోర్ట్‌లో వస్తున్నాయని ఆయన తెలిపారు. బిల్లు లేని వస్తువులు రావడంటెజో నకిలీ వస్తువులు సైతం వచ్చే అవకాశం ఉందని మాటోలియా పేర్కొన్నారు. ఇందులో సీవోసీ ప్రధాన కార్యదర్శి కందుల రవీందర్, కోశాధికారి మనోహర్ కుపాట్, డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ ప్రతినిధులు సందీప్ అగర్వాల్, సతీష్ మిట్టల్, గజానన్, తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ ముందు యూరియా కోసం రైతుల పడిగాపులు



యూరియాను పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి

యూరియా కోసం రైతుల తండ్లాట

- అర్ధరాత్రి నుంచి కార్యాలయం ముందు పడిగాపులు

తలమడుగు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. గత 20 రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో.. పత్తి పంటకు మూడో దశలో భాగంగా యూరియా వేసేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న యూరియా రైతులందరికీ సరిపడక పోవడంతో యూరియా కోసం రైతులు అర్ధరాత్రి నుంచి కార్యాలయం ముందు పడిగాపులు కాస్తున్నారు. యూరియాను తీసుకెళ్లేందుకు మండలంలోని ఆదివాసి గిరిజన గ్రామాల నుంచి ఆదివాసీ రైతులు ఇతర రైతులు తెల్లవారు జామున నాలుగు గంటలకు సహకార సంఘం ముందు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డులతో వేచి చూస్తున్నారు. ప్రతీ రైతుకు ఐదు బ్యాగుల యూరియా అందించాలని రైతులు కోరుతున్నప్పటికీ.. ప్రభుత్వం, జిల్లా అధికారులు యూరియా బస్తాలు తక్కువగా పంపించడంతో ఒక్కొక్క రైతుకు రెండు బస్తాలు తప్ప, ఎక్కువ ఇవ్వడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సహకార సంఘం కార్యాలయంలో రైతులకు యూరియా పంపిణీ చేయగా.. అధికారులకు రైతులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి కార్యాలయానికి వచ్చి సీఈవో మోతే శ్రీనివాస్‌తో కలిసి రైతులకు నచ్చజెప్పి ప్రతీ రైతుకు రెండు యూరియా బస్తాలు, అలాగే ఒకటి నానో యూరియా అందించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు మాట్లాడుతూ రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని రైతులకు సరిపడా యూరియాతో పాటు ఇతర ఎరువులను అందిస్తున్నామన్నారు. జిల్లా అధికారుల సహకారంతో మండలానికి మరిన్ని ఎరువుల కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, త్వరలోనే వస్తున్నాయన్నారు. రైతుల సంక్షేమం కోసం జిల్లా అధికారులు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. అనంతరం రైతులకు మండలంలోని గ్రామాల వారీగా యూరి యాను అందించారు. ఇందులో సహకార సంఘం సిబ్బంది వ్యవసాయ శాఖ ఏఈవోలు రమేష్, స్ఫూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందజేయాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగు కృష్ణారెడ్డి
- ఇచ్చోడ ప్రధాన రహదారిపై నాయకుల రాస్తారోకో
- సిరికొండలోనూ నాయకుల ధర్నా



ఇచ్చోడలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను తీసుకెళ్తున్న పోలీసులు

ఇచ్చోడ, సెప్టంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు యూరియా కోసం గోస పడుతున్నారని, జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందజేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఇచ్చోడలోని ప్రధాన రహదారిపై అంబేడ్కర్ కూడలి వద్ద వందల మంది రైతులు, కార్యకర్తలతో రస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఎనుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చోడ సొసైటీ వద్ద రైతులు ఓ వైపు టోకెన్ కోసం, మరో వైపు యూరియా బస్తాల కోసం భారీగా బారులు తీరుతున్నారన్నారు. గంటల తరబడి నిల్చున్న వారికి యూరియా అందే పరిస్థితి కనిపించడం లేదన్నారు. బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకత్వంలో ఇచ్చోడలో రాస్తారోకో నిర్వహించామన్నారు. ఎన్ని ఏకరాలు ఉన్న పట్టాకు మాత్రం కేవలం రెండు యూరియా బస్తాలను ఇస్తున్నారని, యూరియాతో పాటు ఆదనంగా రూ. 225 విలువ చేసే నానో యూరియా బాటిల్‌ను తీసుకుంటేనే యూరియా బస్తాలను ఇస్తామని సొసైటీ అధికారులు అంటున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాడ్గె సుభాష్, పాండురంగ్, రమేష్, గణేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



సిరికొండలో యూరియా బస్తాలతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

సిరికొండ రూరల్: రైతులకు యూరియా అందించాలని కోరుతూ ఆదివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు ఓరుగంటి పెంటన్న, కదం సూర్యకాంత్, ఎక్బాల్, రంజాన్ మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు యూరియా కోసం సొసైటీ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు సరిపడా యూరియా తెప్పించి ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తోకలు చందు, బియ్యాల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.